# గురువు నేర్పని పాఠం

- నండూరి రవిశంకర్

సమ్మర్ వెకేషన్ కింద ఓ నెల రోజులు రాజేష్ కు సెలవలు దొరికాయి. ఫస్ట్ ఇయర్ ఇంటర్ ఎంపీసీ ఎగ్జామ్స్ రాసేసి లాస్ట్ డే స్నేహితులతో సరదాగా గడిపేసిన రాజేష్ సాయంకాలం అయ్యేసరికి ఇంటికి వచ్చేశాడు. తండ్రి ఆఫీస్ నుండి ఇంటికి ఏడున్నర లోగా వచ్చేస్తాడు. ఈలోగా రాజేష్ ఎక్కడికి వెళ్ళినా ఆరయ్యేసరికి ఇంటికి బుద్ధిగా వచ్చేయడం అలవాటు. తల్లి మీనాక్షికి కొడుకంటే ఎంతగానో ఇష్టం. ఒక్కడే కొడుకు కావడంతో రాజేష్ మీద ఈగవాలనివ్వదు. అలాగని చనువిచ్చింది కదా అని రాజేష్ కూడా ఇష్టారీతిన ప్రవర్తించడు. తల్లికి ఏ పనిచేసి పెట్టాలన్నా ముందుంటాడు. ఆఫీస్ నుండి తండ్రి అలసిపోయి వస్తాడు కనుక .. ఈలోగానే షాప్ నుండి ఏమైనా తీసుకురావాలన్నా.. లేక కూరలు తేవాలన్నా రాజేషే చక్కబెట్టేసేవాడు. తన తండ్రి ఒక ప్రైవేటు ఉద్యోగి కాబట్టి... రాజేష్ కూడా ఇంటి పరిస్థితిని చక్కగా గమనిస్తూ... గొంతెమ్మ కోర్కెలేమి కోరేవాడు కాదు. ఇక ఆ రోజు నుండి కాలేజీ కి సెలవలు. ఊళ్ళో బంధువులున్నప్పటికీ రాజేష్ ఎవ్వరి వద్దకు వెళ్ళడు. ఎందుకంటే వాళ్ళంతా తమ ఫ్యామిలీ కన్నా రెండు మెట్లు ఎత్తులో వున్నారు. అందుచేత వాళ్ళు చూసే జాలి చూపులు... కృత్రిమమైన నవ్వులు భరించలేడు. ఎప్పుడైనా తండ్రి వెళ్ళిరమ్మని అడిగినా ఆ ఒక్కటి తప్ప ఇంకేదైనా చెప్పమనేవాడు.

వ్యక్తిత్వానికే ఎక్కువగా విలువనిచ్చేవాళ్ళంటేనే రాజేష్ కు ఇష్టం. అందుకే తనకు తెలిసి చిన్నప్పటినుంచి కాలేజీ దాకా తన మనస్తత్వాన్ని అర్థం చేసుకున్న ఒకే ఒక్క స్నేహితుడు అంకిత్ మాత్రమే. అంకిత్ ఫ్యామిలీ డబ్బున్నవాళ్ళే అయినా... ఎందుకో వాళ్ళ ఫ్యామిలీ చూపించే ఆప్యాయతలకు కరిగిపోతాడు రాజేష్. ఆ రోజు నుంచి కాలేజీ సెలవలు కావడంతో బద్ధకంగా పొద్దున పదింటిదాకా పక్కనుండి లేవలేదు. ఏదో తన ఇంటిముందర లారీ లోడ్, అన్లోడ్ అవుతున్న శబ్దానికి మెలుకువ వచ్చింది రాజేష్ కు. కిటికీ తలుపు తెరిచి బయటకు చూశాడు. లారీలో సామానులు దిగుతున్నాయి. పెద్దగా సామానులు ఏమీలేవు. పదినిమిషాల్లోనే సామానులు లోపలికి పెట్టేశారు పనివాళ్ళు. ఎవరో కొత్తగా ఎదురింట్లోకి వస్తున్నట్టున్నారు. బద్ధకంగా ఒళ్ళు విరుచుకొని అమ్మ పెట్టిన టిఫిన్ తినేసి టీ తాగేసి అంకిత్ వాళ్ళింటికి వెళుతున్నానని చెప్పి వెళ్ళాడు. మధ్యాహ్నం భోజనం అక్కడే వాళ్ళింట్లోనే తింటానన్నాడు. ఈ నెల్లాళ్ళు వాళ్ళింట్లోనే భోజనం చేయాలని అంకిత్ వాళ్ళ మమ్మీ షరతు పెట్టారు. అందుకు ప్రతిఫలంగా రాజేష్ అంకిత్ కు మాథ్స్ లో టిప్స్ చెప్పేలా... అంకిత్ కొద్దిగా చదువులో పూర్ స్టూడెంట్. ఎంతగా చదివినా బుర్రకెక్కించుకోడు. కాలేజీలో చెప్పింది అక్కడే వదిలేస్తాడు. మళ్ళీ ఇంటికొచ్చాక రాజేష్ తో చెప్పించుకోవడం బాగా అలవాటు.

చిన్నప్పటినుంచి అంకిత్ కు కొద్దోగొప్పో మార్కులు అలా రావడానికి రాజేషే కారణం. అందుకనే రాజేష్ ఇంటికి వస్తే అంకిత్ మమ్మీకి ఎంతో ఆనందం. వాళ్లకు కావలిసినవన్నీ చేసిపెడుతుంది. రాజేష్ కూడా సొంత ఇంట్లో ఉన్నట్లుగానే ఫీలౌతాడు. సాయంత్రం దాకా ఎంజాయ్ చేసి రాజేష్ ఇంటికి వెళ్ళాడు. వచ్చి రాగానే రాజేష్ తల్లి మీనాక్షి కొడుకుతో... ఎదురింట్లో కొత్తగా ముంబాయినుండి వచ్చారు. మధ్యాహ్నం ఎదురింటావిడ పరిచయం చేసుకుంది. తెలుగు అస్సలు రాదట... ఒక్కతే కూతురు, ఒక అబ్బాయి. కూతురు టెన్త్ ఎగ్జామ్స్ సిబిఎస్సీ రాసింది. ఈ సంవత్సరం కాలేజీలో చేర్చాలట. కొడుకు ఈ సంవత్సరం సెవెంత్ కు వస్తాడు.... అంటూ బయోగ్రఫీ అంతా చెప్పేసింది. వెంటనే రాజేష్... ఇదంతా నాకెందుకు చెబుతున్నావు... అన్నాడు. నీ కాలేజీలోనే చేరుస్తుందట వాళ్ళమ్మాయిని... పైగా నీ గ్రూపేనట...ఆ వివరాలు అడగడానికి వచ్చింది. నేను కూడా హిందీ సాహిత్యరత్న చదివాను కదా...ఆమె చెప్పింది అర్థం అయింది. కొంచెం కొంచెం కూడబలుక్కుని హిందీలోనే సమాధానం చెప్పాను. నువ్వు వచ్చాక ఫీజు వివరాలు అడిగి చెబుతానన్నాను...అంటుండగానే ఎదురింటావిడ తన కూతురును వెంటబెట్టుకుని వచ్చింది. తన పేరు రజియాబేగం అని కూతురు జుబేదా అని పరిచయం చేసింది. ముస్లిం ఫ్యామిలీనే అయినా బురఖాలు వేసుకోలేదు. మోడ్రన్ గానే వున్నారు. ముంబాయి నుంచి వచ్చినవాళ్ళు కదా అలానే ఉంటారనుకున్నాడు రాజేష్ మనసులో.

జుబేదాను ఒక్కసారి చూస్తే మళ్ళీ మళ్ళీ చూడాలనిపించే చంద్రబింబంలాంటి మొహం. కో-ఎడ్ కాలేజీయే అయినా..రాజేష్ ఆడువారితో ఎవరితోనూ పెద్దగా మాట్లాడేవాడు కాదు. జుబేదా ఎలాంటి జంకూ లేకుండా రాజేష్ కు షేక్ హ్యాండ్ ఇచ్చింది. మీరు మాట్లాడుకోండని చెప్పి జుబేదా తల్లి, రాజేష్ తల్లి వంటింట్లోకి వెళ్ళిపోయారు. రాజేష్ కు హిందీ, ఉర్దూ కలిపి మాట్లాడటం అంకిత్ వద్ద నేర్చుకున్నాడు. జుబేదాతో మొదట్లో కొద్దిగా జంకుగా మాట్లాడినా జుబేదా చాలా ఫ్రీగా మాట్లాడటంతో కొద్దిగా ధైర్యం తెచ్చుకుని రాజేష్ కూడా మాట్లాడటం మొదలుపెట్టాడు. ఇద్దరూ ఎం పి సి సబ్జక్ట్స్ గురించి డిస్కస్ చేసుకున్నారు. అక్కడి నుండి జుబేదా తరచుగా రాజేష్ వాళ్ళింటికీ...జుబేదాను కలుసుకోవడానికి రాజేష్ జుబేదా వాళ్ళింటికి వెళుతుండేవారు. ఇద్దరి మధ్యా స్నేహం బాగా కుదిరింది. అంకిత్ కూడా వీళ్ళకు బెస్ట్ ఫ్రెండ్ అయిపోయాడు. జుబేదా ఫస్ట్ ఇయర్ లో అన్ని మెరిట్ మార్కులు తెచ్చుకుంటోంది. కాలేజీ లో టాపర్ గా పేరు తెచ్చుకుంది. రాజేష్ కు రోజురోజుకూ జుబేదా మీద అభిమానం పెరిగిపోసాగింది. అంది కాస్తా ప్రేమగా మారిపోయింది.

జుబేదాతో ఆ రోజు ఎలాగైనా సరే తన మనసులోని మాట చెప్పాలనుకుని వాళ్ళింటికి వెళ్ళాడు. జుబేదా తల్లి వంటింట్లో పనిచేసుకుంటోంది. జుబేదాతో రాజేష్ సీరియస్ గా తన మనసులోని మాట బయటపెట్టాడు. తనకు కులాలు, మతాల పట్టింపులు లేవని... అవసరమైతే తన తల్లి తండ్రులను ఎదిరిస్తానన్నాడు. జుబేదా మాత్రం అలాంటి ఫీలింగ్స్ తో తన వద్దకు రావద్దంది. తనకు అలాంటి ఉద్దేశ్యమే లేదనేసింది. ఇంతలో తల్లి కూడా వచ్చింది. రాజేష్ ను వారించింది. రాజేష్

కు భూమి క్రింద బద్దలైపోతున్నట్లనిపించింది. ఇంతలో జుబేదా తల్లి మాట్లాడుతూ.. చూడు రాజేష్ నీకు ఇప్పటిదాకా అవసరం లేదనుకుని ఓ నిజాన్ని చెప్పలేదు. అది విని తట్టుకుని నువ్వు అందుకు సిద్ధం అయితే జుబేదాను నువ్వు పెళ్ళిచేసుకోవడానికి మాకేమీ అభ్యంతరం లేదు. అది కూడా కొన్ని షరతులమీద మాత్రమే. ముందు ఇద్దరూ ఉద్యోగాలలో స్థిరపడ్డాకే... అంది. అందుకు రాజేష్ సరే అన్నాడు. మెల్లిగా జుబేదా తల్లి చెప్పనారంభించింది. తుఫాను ముందర ప్రశాంతతలా ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది.

మాది మొదటినుంచీ ముంబాయి. పెద్దగా బంధువులు కూడా ఎవరూ లేరు. జుబేదా తండ్రి చిన్నప్పుడే చనిపోయాడని నీతో అబద్ధం చెప్పాను...నిజానికి చనిపోలేదు...ఆయన ఉరితీయబడ్డాడు. ఎందుకంటే అతనిమీద తీవ్రవాది అని ముద్రవేసి ప్రభుత్వం 4 సంవత్సరాలపాటు జైలులో వుంచి చివరకు ఉరితీసింది. అతని పేరు ఓమరుద్దీన్. ఒమర్ వాస్తవానికి ఓ మంచి తండ్రి. జుబేదాను, ఆమె తమ్ముడినీ ఎంతో ప్రేమగా చూసుకునేవాడు. నాకు ఏలోటు లేకుండా తాను ఊరెళ్ళినప్పుడల్లా ఇబ్బంది లేకుండా నా బ్యాంకు ఎకౌంటు లో ఎప్పుడూ ఐదారు లక్షల రూపాయలు ఉండేలా చేయడమే కాకుండా... చేతి ఖర్చుల కింద ఇంట్లో ఎప్పుడూ ఓ యాభైవేల రూపాయలు ఉంచి వెళ్ళేవాడు. తాను దుబాయ్ లో కాంట్రాక్ట్ వర్క్ మీద వెళుతున్నానని చెప్పేవాడు. అంతకుమించి నాకు ఆయన చేస్తున్న ఉద్యోగం గురించి తెలియదు. రంజాన్ కు మాత్రం నెల రోజులు పూర్తిగా మాతోనే గడిపేవాడు.

అయితే ఒకరోజు సడన్ గా టివి లో ఆయన అరెస్ట్ వార్త విని అవాక్కయ్యాను. ఎలాగోలా అతికష్టం మీద సెంట్రీకి డబ్బులు లంచం ఇచ్చి ఆయనను కలిశాను. పిల్లలను ఎక్కడికైనా దూరంగా తీసికెళ్ళి చదివించమన్నాడు. ఆయన కళ్ళల్లో సూటిగా చూస్తూ అడిగాను. నిజంగా మీరు దేశద్రోహం చేశారా అని.. ఒమర్ ఒక్కటే అడిగాడు...నువ్వు నమ్ముతున్నావా? అని...లేదు అన్నాను. ఎవరో తనని ఇరికించారన్నాడు. తనకు మాత్రం ఏమి తెలియదన్నాడు. అల్లాకి కసమ్ అన్నాడు. తన స్నేహితుడి ఫోన్ నెంబర్ ఇచ్చాడు. అతనిని కలిస్తే ఒక కోటి రూపాయలు ఇస్తానన్నాడు. ఆ డబ్బులను తీసుకొని, దూరంగా వెళ్ళి పిల్లలను ప్రయోజకులను చెయ్యమన్నాడు. తనలాంటి దురదృష్టవంతుడిని జన్మలో తలుచుకోకండని చెప్పాడు... మళ్ళీ మళ్ళీ కలుసుకోవాలని ప్రయత్నించొద్దన్నాడు. పోలీసులు ఆరా తీస్తే అది అందరికీ ప్రమాదమన్నాడు. ఒమర్ ని ఉరి తీశారు. ఆ సంవత్సరమే జుబేదా ముంబాయిలో టెన్త్ ఎగ్జామ్స్ రాసింది. తండ్రి గురించి కొద్దికొద్దిగా తెలుసుకుంది. ఆ ప్రభావం తెలియకుండా అక్కడే పెంచాను. ఎప్పటికైనా రాష్ట్రపతి క్షమాభిక్ష పెట్టకపోతారా... ఆయన విడుదల కాకపోతాడా అనుకుని ఇన్నాళ్ళు ముంబాయిలోనే ఉండిపోయాను. ఇక ముంబాయిలో ఎంతమాత్రం ఉండదలుచుకోలేదు. పిల్లలను తీసుకుని హైదరాబాద్ వచ్చేశాను. ఈ దగ్గరలోని కాలేజీలో కోచింగ్ బాగుంటుందని తెలిసింది. అదే టైముకు మీ ఎదురిల్లు ముందర టులెట్ బోర్డు చూసి చేరిపోయాము.

www.sirimalle.com

ఇప్పుడు చెప్పు ఈ టెర్రరిస్ట్ ఫ్యామిలీ నుంచి వచ్చిన అమ్మాయిని నువ్వు పెళ్లాడగలవా...అంది. వెంటనే రాజేష్.. చూడండి ఆంటీ, అంకుల్ తెలిసి ఏ తప్పూ చేయలేదు. దురదృష్టం కొద్దీ అలా అయింది. అయినా అందుకు మీరు ఎంతమాత్రమూ బాధ్యులు కారు. మీరు చెప్పినట్లుగానే నేను జీవితంలో సెటిల్ అయ్యాకే మీ అమ్మాయిని పెళ్ళిచేసుకుంటాను. అంకుల్ జీవితం ప్రతిఒక్కరికీ గుణపాఠం కావాలి. మనకు తెలియకుండానే ఒక్కోసారి కొందరు స్నేహితులు మనల్ని ఇరికిస్తుంటారు. మీ వలన నేను జీవిత సత్యాన్ని తెలుసుకున్నాను. వచ్చే క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికవుతాననే నమ్మకం వుంది నాకు. తప్పకుండా వచ్చే రెండేళ్లలో మీ అమ్మాయిని కూడా ఇదే ఫీల్డ్ లో చేరుస్తాను. మీరు మీ మాటమీద వుండండి. జుబేదా, ఇక నేను లైఫ్ గురించి సీరియస్ గా ఆలోచిస్తాను. లైఫ్ లో సెటిల్ అయ్యాకే నీ వద్దకు వస్తాను. ఆ నమ్మకం నీకు వుంటే రెండేళ్ళు ఆగు అన్నాడు.

ఈ రెండేళ్లలో రాజేష్ తన తల్లితండ్రులను ఒప్పించాడు. క్యాంపస్ ఇంటర్వ్యూ లో మంచి కంపెనీలో ఉద్యోగం సంపాదించాడు. తనతో పాటు జుబేదాకీ ఉద్యోగం తన కంపెనీలోనే వచ్చేటట్లు చేసుకున్నాడు. అందరి ఆమోదంతో పెళ్లి చేసుకున్నాడు. పెళ్లి రోజు, జుబేదాతో రాజేష్ ...నీ సాంగత్యంలో గురువు నేర్పని పాఠం నేర్చుకున్నాను. నా జీవితంలోకి నువ్వు రాకపోయివుంటే నేను కూడా ఉగ్రవాదిలా అయ్యేవాడినేమో.. ఇప్పటికి మాత్రం మానవతావాదినే అని మనస్ఫూర్తిగా నవ్వాడు.

www.sirimalle.com